క్లుప్తంగా

సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

లావేరు: మండలంలోని మెట్టవలస హైస్కూల్‌లో పిన్నింటి పోలారావు అనే వ్యక్తి తన సొంత నిధులతో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీంతో విగ్రహాన్ని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు రొక్కం బాలకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు మీసాల సీతన్నాయుడు, ఎంఈవో ఎల్.ఈశ్వరరావు, హెచ్ఎం మజ్జి మురళీ కృష్ణారావులు గురువారం ఆవిష్కరించారు. అనంతరం విగ్రహం ఏర్పాటు చేసిన పోలారావును సన్మానించారు. కార్యక్రమంలో బుడతవలస పంచాయతీ సర్పంచ్ రొతు సురేంద్ర, జేసీఎస్ మండల ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, సీఆర్‌పీ టి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట



ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి విగ్రహం

జి.సిగడాం: మండలంలోని నిద్దాం పంచాయతీ అధ్వాన్నంపేట (శ్రీరాంపురం) గ్రామంలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయ స్వామి విగ్రహం ప్రతిష్ఠ కార్యక్రమాలను వైభవంగా గురువారం నిర్వహించారు. గత మూడు రోజుల పాటు స్వామివారికి ప్రత్యేక హోమాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు నారాయణసేవ చేశారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నృసింహ జయంతి



నృసింహస్వామికి జలాభిషేకం చేస్తున్న దృశ్యం

గార: శ్రీకూర్మనాథాలయంలో బుధవారం వైశాఖ చతుర్ధశి సందర్భంగా నృసింహజయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. బేడా మంటపంలో నృసింహమూర్తిని వేంచింపజేసి పవిత్ర జలాలతో అభిషేకించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, కిషోర్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.


దైవ అనుగ్రహంతో మోక్షం



ప్రసంగిస్తున్న పులఖండం శ్రీనివాసరావు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని రాజరాజేశ్వరీ లలితా మహాత్రిపుర సుందరీ దేవి పీఠం ఆధ్వర్యంలో జరుగుతున్న జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం వివేక చూడామణిపై ఆధ్యాత్మిక ప్రసంగం జరిగింది. ఈ సందర్భంగా గాయత్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు మాట్లాడుతూ మనిషులు ఏ విధంగా ఉద్ధరింపబడతారో శంకరాచార్యులు వివేక చూడామణిలో చక్కగా వివరించారని చెప్పారు. దైవ అనుగ్రహం ద్వారా మోక్షం లభిస్తుందన్నారు. అంతకుముందు అష్టోత్తర శత నామ పూజ, చండీహోమం, పూర్ణాహుతి జరిగింది. కార్యక్రమంలో పీఠం నిర్వాహకులు పెంట రామచంద్రశేఖర శర్మ, వాశిష్ట కార్తికేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీ సాయిబాబాకు పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జి.సిగడాం: మండల పరిధిలోని దేవరవలస, ఎందువ, జి.సిగడాం, పెంట, చంద్రయ్యపేట గ్రామాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో షిర్డీ సాయిబాబాకి పూజలు నిర్వహించారు. ఆనందపురం గ్రామంలో ఉన్న 100 అడుగుల ఎత్తు గల వెంకటి సాయికోటి మహాస్థూపం, 46 అడుగుల నాగసాయి వద్ద ఉదయం 5 గంటల నుంచి బాబాకు సత్యవ్రతాలు, సాయి శాంతి హోమ పూజలు వైభవంగా నిర్వహించారు.

మహాలక్ష్మికి కుంకుమార్చనలు



బంగారు కవచధారణలో స్వామివారు



జిల్లా కేంద్రంలోని పీఎన్ కాలనీలో నారాయణ తిరుమలలో స్వామివారి కల్యాణోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు నేతృత్వంలో భూనీళా సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన కల్యాణ మండపంపై ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల సమక్షంలో అమ్మవారికి అష్టోత్తర, శత నామాలతో సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారు బంగారు కవచ ధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో వేంకట రామానుజ సేవాదళం సభ్యులు, పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో ఈశ్వరరావు తదితరులు

లావేరు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో ఎల్.ఈశ్వరరావు అన్నారు. చదువంటే మాకిష్టం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మెట్టవలస గ్రామంలో హైస్కూల్ సిబ్బందితో కలిసి విద్యార్థుల తల్లిదండ్రులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యార్హత కలిగిన ఉపాధ్యాయులతో బోధనలు ఉంటాయన్నారు. అలాగే ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంలు, నోట్‌బుక్స్ తదితర సామగ్రి జగనన్న విద్యా కానుక రూపంలో ఇవ్వడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం మజ్జి మురళీకృష్ణారావు, సీఆర్‌పీ టి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

స్టోన్ ప్లాంటేషన్ త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ శాంతి

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం డివిజన్‌లో స్టోన్ ప్లాంటేషన్, భూహక్కు పత్రాల పంపిణీ త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీకాకుళం ఆర్డీఓ బొడ్డేపల్లి శాంతి సూచించారు. శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ వెంకటరావు, డిప్యూటీ తహశీల్దార్ రాజులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫస్ట్‌ఫేజ్‌లో శ్రీకాకుళం డివిజన్‌కు సంబంధించి 167 గ్రామాలకు గాను 1,93,208 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తయినట్లు తెలిపారు. ఇంకా 58,412 గ్రామాల్లో ప్రక్రియ పూర్తికావాల్సి ఉందన్నారు. శ్రీకాకుళం మండలంలో 29 గ్రామాలకు గాను 27 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని చెప్పారు. భూమి పత్రాలను సైతం ఈ నెల 15లోగా పూర్తవుతుందన్నారు.

రాణాప్రతాప్‌కు 'కవి శ్రేష్ఠ' బిరుదు

హిరమండలం: జాతీయ సాహిత్య సంబరాలు సందర్భంగా రుగడ గ్రామానికి చెందిన యువ కవి, రచయిత ఐ.రాణాప్రతాప్‌కు తెలుగు వెలుగు సాహిత్య వేదిక ఎస్.వి.ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన జాతీయ సాహిత్య సంబరాల ఉత్సవాల్లో భాగంగా 'కవి శ్రేష్ఠ' బిరుదు ప్రదానం చేశారు. ఆయన కవితకు ఉత్తమ కవితగా సంకలనంలోకి ఎంపిక చేశారు. జాతీయ సాహిత్య పురస్కారం, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు ధ్రువపత్రాన్ని కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి కీలపర్తి దాలినాయుడు చేతులమీదుగా అందజేశారు.

సర్పంచ్ ఔదార్యం

బూర్జ: మండలంలోని కాలపర్తి గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్ పొదిలాపు చిట్టయ్య కుమార్తె వివాహం సందర్భంగా సర్పంచ్ బిర్లంగి వరహాలునాయుడు రూ.6 వేలు ఆర్థిక సహాయం గురువారం అందించారు. గతంలో ఆ కుటుంబం ఇల్లు కట్టుకునేందుకు రూ.15 వేలు సాయం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు

మెళియాపుట్టి: గ్రామ పంచాయతీల వికేంద్రీకరణలో భాగంగా ఏర్పడిన నూతన గిరిజన గ్రామ పంచాయతీల క్షేత్ర సహాయకులు బాల కృష్ణ (కొత్తూరు గ్రామపంచాయితీ), సవర ప్రసన్నకుమారిలకు ఎమ్మెల్యే రెడ్డిశాంతి బుధవారం నియామక పత్రాలను అందజేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గురువారం రామచంద్రాపురంలో వారు జెడ్పీటీసీ గూడ ఎండయ్యను కలిసి కృతజ్ఞలు తెలిపారు. ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ, ఎమ్మెల్యే రెడ్డిశాంతిలకు సైతం కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గూడ వసంత కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలే ముద్దు

నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిచ్చి అభివృద్ధి చేస్తుండటంతో సర్కారు బడుల రూపురేఖలు మారాయి. విద్యార్థులకు పలు పథకాలు వర్తింపజేస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో జాయిన్ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఎంఈఓ శాంతారావు సూచనల మేరకు ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తున్నారు. దేశవానిపేట యూపీ స్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు నల్లాన జయరావు, ఎం.అనూరాధ గ్రామంలో గురువారం ప్రచారం చేశారు. తల్లిదండ్రుల నుంచి స్పందన బాగుందని, ఇప్పటి వరకూ 21 మంది పిల్లలు జాయినయ్యారని తెలిపారు.

మహిళల చైతన్యంతోనే పల్లెల అభివృద్ధి



మాట్లాడుతున్న రామకృష్ణంనాయుడు

జి.సిగడాం: మహిళల చైతన్యంతోనే పల్లెలు అభివృద్ధి సాధిస్తాయని ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు అన్నారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీలరాణి అధ్వర్యంలో లోకోస్ యాప్‌పై సీసీలకు శిక్షణా తరగతులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామకృష్ణంనాయుడు మాట్లాడుతూ స్వయం శక్తి సంఘాల సభ్యులు లావాదేవీలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించిన సభ్యులకు ప్రత్యేక రుణాలను అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న నాయకులు

జి.సిగడాం: వైఎస్సార్‌సీపీ హయాంలో అర్హులందరికీ నిష్పక్షపాతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కృషితో 21 గ్రామ సచివాలయాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలియజేశారు. నిర్మాణాలు పూర్తయిన సచివాలయాలను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు బూరాడ వెంకటరమణ, డాక్టర్ మీసాల రాంబాబు, జేసీఎస్ కన్వీనర్ దోల వెంకటరమణ, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, చిత్తిరి మోహన్, మీసాల సీతారాం, మహేష్ పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో బహుళ ప్రయోజనాలు



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: రైతులు నవధాన్యాలు సాగు చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు పొందవచ్చని కొత్తూరు వ్యవసాయ సబ్ డివిజన్ యాంకర్ బాబాజీ అన్నారు. వ్యవసాయ శాఖ రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో గురువారం కొత్తూరులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులతో నవధాన్యాలు సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమి సారవంతమవుతుందన్నారు. అధిక దిగుబడులు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఎంటీ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేతో శాశ్వత పరిష్కారం



హిరమండలం: చొర్లంగిలో హద్దులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

హిరమండలం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు పథకంతో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని పిండ్రువాడ, చొర్లంగి గ్రామాల్లో రైతుల భూముల్లో ఏర్పాటు చేసిన హద్దులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ల ప్రకారం రైతుల సమక్షంలో సర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.మురళీమోహన్‌రావు, మండల సర్వేయర్‌పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: ఇప్పటికే సమగ్ర భూమి రీసర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లో సరిహద్దు రాళ్లను పాతాలని తహశీల్దారు బి.ఎస్.ఎస్ సత్యనారాయణ సిబ్బందిని ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో సర్వే సిబ్బందితో సమావేశమై వివరాలు తెలుసుకున్నారు. మండలంలో 47 రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటి వరకు 36 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తయినట్లు తెలిపారు. మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, గ్రామ సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణంతో భక్తిభావం



శతచండీ యాగం విశిష్టతను వివరిస్తున్న అర్చకులు

జలుమూరు: ఆలయాల నిర్మాణంతో ప్రజల్లో భక్తి భావం పెరిగి తద్వారా లోక కల్యాణం జరుగుతుందని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం రావిపాడు పంచాయతీ తిలారు ఆర్ఎస్ వద్ద అర్చకులు బంకుపల్లి అన్నాజీ శర్మ ఆధ్వర్యంలో జరిగిన అసిరిమాంబ ఆలయ ప్రతిష్ఠాపన, కోటి కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొని రుత్వికులతో మాట్లాడారు. శతచండీ యాగం చేయడం ద్వారా పాడిపంటలు చక్కగా పండి ప్రజలంతా ఆనందంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, నిర్వాహక కమిటీ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టి రాజు

బూర్జ: పని ప్రదేశాల్లో సమయపాలన పటించడం ద్వారా గరిష్ఠ వేతనం పొందవచ్చునని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ జి.వి.చిట్టిరాజు అన్నారు. గురువారం పి.ఎల్.దేవిపేట పంచాయతీ పరిధిలో జరుగుతున్న చెరువు అభివృద్ధి పనులతో పాటు హార్టికల్చర్ పనులు, వావాం గ్రామ చెరువు పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి సిబ్బంది, వేతనదారులతో మాట్లాడారు. కనీసం ఆరు గంటల పాటు పని చేయడం ద్వారా రూ.270 పైగా వేతనాన్ని పొందవచ్చన్నారు. ఇటీవల వేతనదారులకు రోజుకు రూ.15 వేతనం అదనంగా పెంచినట్లు తెలిపారు. పనుల్లో నాణ్యతకు, పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. ప్రతి కూలీకి 100 రోజులు పనిదినాలు పని కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. లక్ష్యాన్ని చేరుకోలేని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ పి.రాధ, ఎంపీడీఓ ఎం.రవీంద్రబాబు, ఏపీఓ వి.రాజీకుమార్, టెక్నికల్ అసిస్టెంట్ రామకృష్ణ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

సారవకోట: వీఓఏలకు ఇస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకుని స్వయం శక్తి సంఘాల బలోపేతానికి కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ డి.వి.విద్యాసాగర్ సూచించారు. గురువారం సారవకోట ఎంఎంఎస్ కార్యాలయంలో వీఏఓ, సీసీలకు జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్‌లో ఎస్‌హెచ్‌జీల అనుసంధానంలో భాగంగా లోకోస్ యాప్‌పై శిక్షణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం శక్తి సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి ఏరియా కో ఆర్డినేటర్ శ్రీరాములు, ఏపీఎం గోవిందరాజు, పాల్గొన్నారు.

జలుమూరు: లోకాస్ యాప్ శిక్షణను వీఓఏలు సద్వినియోగం చేసుకొని సాంకేతికతను అందిపుచ్చుకోవాలని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ అన్నారు. గురువారం జలుమూరు వెలుగు సమాఖ్య మందిరంలో స్వయం శక్తి సంఘాల సభ్యుల శిక్షణ ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు లోకాస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని స్వయం శక్తి సంఘ సభ్యుల వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు పిట్ట వనజాక్షి, ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు రమణ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలాకి(నరసన్నపేట): సెర్ప్ మార్గ దర్శకాల మేరకు స్వయం శక్తి సంఘాల ఆర్థిక వ్యవహారాలు నిక్షిప్తం చేసేందుకు లోకస్ (ప్రజలే ఆపరేటింగ్ చేసుకొనే సిస్టం) యాప్‌పై వెలుగు సిబ్బంది అవగాహన పెంచుకోవాలని ఏసీ కొండలరావు అన్నారు. మండల స్థాయిలో సిబ్బందికి, సీసీలు, వీఓఏలకు నాలుగు రోజుల శిక్షణా శిబిరం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబాన్నీ సంఘాల్లో చేర్పించడం, ఎంజీఎన్ఆర్ఎస్ జాబ్ కార్డు ఇప్పించడం, ఆగిపోయిన సంఘాల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలు చేపట్టాలని వీఓఏలకు సూచించారు. సమావేశంలో ఏపీఎం రాజారావు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం



కొత్తకోట సచివాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

• అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో స్పీకర్ తమ్మినేని

సరుబుజ్జిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన గ్రామ సచివాలయం వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం సాకారమవుతోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కొత్తకోట గ్రామ సచివాలయం, విలేజ్‌హెల్త్‌క్లినిక్, ఆర్బీకే, తురకపేట, కొత్తకోటలో జలజీవన్‌మిషన్ తాగునీటి కుళాయిలను స్పీకర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ తాగునీటిని అందించే దిశగా పనిచేస్తున్నామని చెప్పారు. అందరికీ విద్య, వైద్యం, మౌలిక వసతులు కల్పించినపుడే సమాజం అగ్రగామిలో పయనిస్తుందనే ముందుచూపుతో ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. అందరికీ వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు గ్రామస్థాయిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. దళారీలతో సంబంధం లేకుండా పథకం ప్రయోజనాలు నేరుగా లబ్ధిదారులు ఖాతాలకు అందించి అవినీతి రహితపాలనకు నాందిపలికారని పేర్కొన్నారు. పథకాలు డోర్ డెలివరీ విధానంలో చేరేందుకు ఏర్పాటు చేసిన సచివాలయం వ్యవస్థ సత్ఫలితాలనిస్తోందని సంతోషం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ జి.వి.శివానందమూర్తి, పార్టీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు, బీసీ సెల్ అధ్యక్షుడు మూడడ్ల రమణ, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, ఎస్సీ కార్పొరేషన డైరెక్టర్ ఎడ్ల ఈశ్వరరావు, కొత్తకోట ఎంపీటీసీ సభ్యుడు సురవరపు సింహాచలం, ఎంపీడీఓ పి.వి.మురళీమోహనకుమార్ కొత్తకోట సర్పంచ్ సురవరపు జగదీష్, యువజన నేత గండివలస ఉపేంద్ర, బెండి శ్యామలరావు, సిరిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలు అందజేత



నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: కొత్తూరు మండలంలో ఎమ్మెల్యే రెడ్డి శాంతి చొరవతో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీలకు అంగన్‌వాడీ కార్యకర్తలను, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులను(ఫీల్డ్ అసిస్టెంట్) అధికారులు నియమించారు. వీరికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసన సభ్యురాలు రెడ్డి శాంతి చేతుల మీదుగా గురువారం నియామక పత్రాలను అందజేశారు. కొత్తూరు మండలం నివగాం–3 అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్తగా సవలాపురపు రాజులమ్మ, కొండరాగోలు అంగన్‌వాడీ సహాయకురాలిగా కొంకి శ్యామల, పాత హిరమండలం–1 అంగన్‌వాడీ కేంద్రం సహాయకురాలిగా సామంతు లక్ష్మి, కారిగూడ పంచాయతీ ఉపాధి హామీ పథకం క్షేత్రసహాయకుడిగా సవర మొఖలింగం, అడ్డంగి పంచాయతీ క్షేత్ర సహాయకుడిగా సవర బాపు నియామక పత్రాలు అందుకున్నారు. నియోజకవర్గంలో నూతనంగా 20 గిరిజన పంచాయతీలను ఏర్పాటయ్యాయని, ఆయా పంచాయతీల్లో సిబ్బందిని నియమించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో హిరమండలం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, కొత్తూరు పార్టీ మండల అధ్యక్షుడు పారిశెల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.